# పేరుకుపోతున్న చెత్త, వ్యర్థాలు

- బాధ్యతారహితంగా రోడ్డుపైనే పడేస్తున్న కొందరు
- చెప్పుల దండ కట్టి హెచ్చరించినా మారని తీరు
- పలు కాలనీల్లో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం




క్రాంతినగర్‌లో రోడ్డు పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్త వేయొద్దని ఏర్పాటు చేసిన కంచె, బ్యానర్

**హన్మకొండ:** ప్రభుత్వం, వరంగల్ మహానగర పాలక సంస్థ స్వచ్ఛతకు పెద్దపీట వేస్తున్నా నగరంలో పారిశుద్ధ్యం కొరవడుతోంది. పలు వీధుల్లో ఎక్కడపడితే అక్కడ రోడ్లపై చెత్త, వ్యర్థాల కుప్పలు దర్శనమిస్తున్నాయి. వరంగల్ మహానగర పాలక సంస్థ చెత్త సేకరణ వాహనాలను సమకూర్చినా కొంత మంది బాధ్యతారహితంగా వీధుల్లోనే చెత్త, వ్యర్థాలను వేస్తున్నారు. పారిశుద్ధ్యంపై కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. వీధుల్లో చెత్త వేయకుండా చెప్పుల దండా కట్టి హెచ్చరించినా అలాంటి వ్యక్తుల్లో కనీస మార్పు రాకపోవడం సిగ్గుచేటని కాలనీవాసులు పేర్కొన్నారు. చెప్పులను చూసైనా వారి ప్రవర్తనలో మార్పు వస్తుందని ఆశిస్తే తమకేమీ పట్టనట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్వచ్ఛత కోరుకునే వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పలు కాలనీల్లో రోడ్లపైనే చెత్తాచెదారం**

హనుమకొండలోని విద్యానగర్, క్రాంతి నగర్‌లలో అక్కడక్కడ వీధుల్లో చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. ఇంటింటికి చెత్త సేకరణ వాహనం వెళ్లన్నా కొంత మంది ఆ వాహనంలో చెత్త వేయకుండా తీరిక సమయాల్లో తీసుకెళ్లి వీధుల్లో పడేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాలకు చెత్త సేకరణ వాహనం రావడం లేదని రోడ్లపైనే చెత్తాచెదారాన్ని పారబోస్తున్నారు. విద్యానగర్‌లో రేషన్ దుకాణం సమీపంలో చెత్త వేస్తుండడంతో పరిసరాలు కలుషితమవుతున్నాయని చెప్పుల దండా కట్టారు. క్రాంతి నగర్‌లోని ఇంటి నంబర్ 2 – 4– 440/1 సమీపంలో చుట్టుపక్కల వారు ఇష్టానుసారంగా చెత్త పడేస్తుండడంతో ఆ ప్రాంతంలో కంచె ఏర్పాటు చేసి చెప్పులు వేలాడ దీశారు. అయినా అక్కడే చెత్త పడేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, ఇంటి నంబర్లు 2-4-425/4, 2-4-815 సమీపంలో చెత్త, వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి.

**వారించినా ఖాతరు చేయడం లేదు**

ఇక్కడ చెత్త వేయొద్దని వారించినా కొంతమంది సిగ్గూశరం లేకుండా చెత్త పడేసి పోతున్నారని సమీప నివాసితులు వాపోయారు. చెత్త కుళ్లి దుర్వాసన వస్తోందని, ఆ వాసన భరించలేక పోతున్నామని అంటున్నారు. పరిసరాలు కలుషితమై వ్యాధుల బారిన పడుతున్నామని చెబుతున్నారు. తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని మొత్తుకుంటున్నారు. వీధుల్లో విచ్చలవిడిగా చెత్త పడేసే వారికి జరిమానా విధించాలని, తమ ఇళ్ల వద్ద చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

**వారించినా పట్టించుకోవడం లేదు**



మా ఇంటి ముందు చెత్త వేస్తుంటే వద్దని వారించినా వినడం లేదు. చెప్పుల దండా కట్టినా, గుడిలాగా ఏర్పాటు చేసి పూజలు చేసినా అక్కడే చెత్తాచెదారం వేస్తున్నారు. చెత్త వేయొద్దని ఇంతకన్నా మించి వారికి ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు. వీధుల్లో ఇష్టానుసారంగా చెత్త వేసి పరిసరాలను కలుషితం చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పోలోజు భిక్షపతి, క్రాంతినగర్

# కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి




సీపీఐ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

**ఖిలా వరంగల్:** పెట్టుబడిదారులకు కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయమని, మతోన్మాదులే దేశానికి ప్రమాదకరమని, ఆపరేషన్ కగార్‌పై న్యాయ విచారణ చేయించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని రోటరీక్లబ్ ఆఫ్ వరంగల్ భవనంలో దండు లక్ష్మణ్, గుండె బద్రి, అక్కెపల్లి రమేశ్, ల్యాదెల్ల శరత్, తోట చంద్రకళ అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా సీపీఐ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో విప్లవకారుల హత్యలను ఆపి శాంతి చర్చలు జరపాలని కోరారు. సీపీఐ ఆవిర్భవించి ఈఏడాది డిసెంబర్ 25 నాటికి వందేళ్లు కావొస్తున్న సందర్భంగా ఖమ్మంలో ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయసారథి, నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు టి.వెంకట్రాములు, సిరబోయిన కరుణాకర్, పంజాల రమేశ్, అదరి శ్రీనివాస్, సయ్యద్ వలీఉల్లాఖాద్రీ, స్టాలిన్, ఎస్‌కే బాష్‌మియా, పనాస ప్రసాద్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

**కాజీపేట అర్బన్:** ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు కాజీపేట తహసీల్దార్ భావ్‌సింగ్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ పరిధిలోని కాజీపేట మండలం న్యూశాయంపేటలోని సర్వే నంబర్ 579లోని 39 ఎకరాల భూమి కబ్జాకు గురవుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిగాల భిక్షపతి, శంకర్ నాయక్, రాసమల్ల కుమార్, పూర్ణచందర్, వెంకటేష్, సారయ్య, కొమురయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రంలో వసతులు కల్పించాలి



వైద్యురాలితో మాట్లాడుతున్న రత్నమాల

**ఖిలా వరంగల్:** పడమరకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస వసతులు కల్పించాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల కోరారు. ఈ మేరకు ఖిలా వరంగల్ పడమర కోటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఠాగూర్ భవాని, రమ, అనిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**మడికొండ:** 46వ డివిజన్ మడికొండలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కాంగ్రెస్ నాయకులు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాజు యాదవ్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రం అమర్‌నాథ్, బిల్లా రవీందర్, వసుకుల శంకర్, బైరి లింగమూర్తి, పైడిపాల రఘుచందర్, నాగరాజు, శ్రీనివాస్, శివ, కొప్పుల నవీన్ యాదవ్, పల్లపు అర్జున్, గద్దు రాజు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ కేంద్రీయ వర్సిటీలో సీటు

**కేయూ క్యాంపస్:** హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఏ పూర్తిచేసిన విద్యార్థి ఎల్లబోయిన నవీన్‌కుమార్‌కు ఢిల్లీలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో సీటు లభించింది. ఈ మేరకు కళాశాలలో నవీన్‌కుమార్‌ను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, అధ్యాపకులు గురువారం అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంజీవ్, వీరస్వామి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అలాంటి ఉద్యోగులను ప్రజలు మరిచిపోరు



పరమాత్మను సన్మానిస్తున్న అధికారులు



హసన్‌పర్తి: అరవింద్‌ను సన్మానిస్తున్న అతిథులు

**న్యూశాయంపేట:** నిస్వార్థంగా, నిజాయితో సేవ లందించిన ఉద్యోగులను ప్రజలు ఎప్పుడూ మరిచిపోరని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి కౌసల్యాదేవి అన్నారు. పదవీ విరమణ పొందిన డీఆర్‌డీఏ ఏఓ పరమాత్మ, సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ అశోక్‌తో పాటు బదిలీపై వెళ్లిన జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు, ఏపీఎంలకు డీఆర్‌డీఏ కార్యాలయ సమావేశ మందిరంలో ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ రేణుకాదేవి, అధికారులు భవాని, రమేష్, గోలి కొంరయ్య, రవి, విజయ్, దయాకర్, రేవతి, దాసు, అనిల్, వరలక్ష్మి, నీలవేణి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**ఉద్యోగులకు విరమణ సహజం**

**హసన్‌పర్తి:** ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ఏడీఈ అశోక్‌కుమార్ అన్నారు. చింతగట్టు సబ్‌స్టేషన్‌లో ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన అరవింద్‌ను ఎర్రగట్టు గుట్ట సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం సన్మానించారు. కార్యక్రమంలో ఏఈలు సత్యనారాయణ, శిరీష్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ రౌతు రమేష్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్, లైన్‌మెన్ మల్లికార్జున్, సిబ్బంది మారం రమేష్, వాజీద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**టీజీఎస్పీ పోలీసుల పదవీ విరమణ**

**మామునూరు:** ఖిలా వరంగల్ మండలం మామునూరు టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలో పోలీస్ అధికారుల పదవీ విరమణ కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా కమాండెంట్ రాం ప్రకాశ్ హాజరై పదవీ విరమణ పొందిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు చంద్రన్న, సలీమొద్దీన్, యేసు పాదం, యాకుబ్ రెడ్డి, బాల కాశయ్యతోపాటు ఏఆర్‌ఎస్సైలుగా విధులు నిర్వహించిన ఏడుగురికి మెమొంటోలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఏసీ కృష్ణప్రసాద్, శ్రీనివాస్‌రావు, వీరన్న, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కార్తీక్, విజయ్, రాజిరెడ్డి, రవి, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణ పాల్గొన్నారు.

# కేడెట్లకు డ్రోన్ వినియోగంపై శిక్షణ

**కేయూ క్యాంపస్:** 4వ తెలంగాణ ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ వరంగల్ ఆధ్వర్యంలో ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్ కేయూ స్పోర్ట్స్ మైదానంలో ఎన్‌సీసీ క్యాంపు నిర్వహిస్తున్నారు. డిప్యూటీ డైరెక్టరేట్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 7 గ్రూపులకు సంబంధించి 200 మంది 9 విభాగాల్లో శిక్షణ పొందుతున్నారు. ఈ మేరకు ఎన్‌సీసీ కేడెట్లకు డ్రోన్ వినియోగంపై గురువారం శిక్షణ ఇచ్చారు. రక్షణ రంగంలో వాటి ఉపయోగాలు, సాంకేతిక పరిజ్ఞానంలో దాని పాత్రపై అవగాహన కల్పించారు. క్యాంపు 4వ తెలంగాణ ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ వరంగల్ కమాండింగ్ అధికారి ఆశిష్ భాస్కర్, ధనాకే ఆధ్వర్యంలో కొనసాగుతోంది. వింగ్ కమాండర్ కోలనెల్ అమిత్‌పాండే పర్యవేక్షిస్తున్నారు. లెఫ్టినెంట్ కమాండర్ వీకే ఆర్య, గణేష్, సుమిత్ కిషన్, ఆర్.శర్మ, శ్యామ్, సర్జెంట్ ఫణీంద్ర, శీతల్‌రాణ పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న కమాండెంట్ కల్నల్

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

కేయూ ఇండోర్ స్టేడియంలో ఎన్‌సీసీ వరంగల్ గ్రూప్ క్యాంపులో భాగంగా గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వరంగల్ గ్రూప్ కమాండర్ సచిన్ అన్నారావ్ నిషాల్కర్ మీర్ చక్ర హాజరు కాగా, క్యాంపు కమాండెంట్ కల్నల్‌ఎస్ రామదుర్రై మాట్లాడారు.

# ధర్మారంలో వివాహిత కిడ్నాప్

**గీసుకొండ:** మండలంలోని ధర్మారం బస్టాండ్ వద్ద గురువారం రాత్రి వివాహిత కిడ్నాప్ అయ్యింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన రింకుమల్లి.. గౌరి పెంద్రా, ప్రియాంక, ప్రియతో కలిసి ధర్మారంలో నివాసం ఉంటోంది. వీరు శాయంపేట గ్రామంలోని కిటెక్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. గురువారం విధుల్లోకి వెళ్లి తిరిగి కంపెనీ బస్సు దిగి ధర్మారం బస్టాండ్ వద్ద నడుచుకుంటూ వస్తున్నారు. వరంగల్ నుంచి నర్సంపేట వైపు కారులో వెళ్తున్న నలుగురు వ్యక్తులు వచ్చి రింకుమల్లిని కిడ్నాప్ చేసి, కారులో నర్సంపేట వైపు పారిపోయారు. స్థానిక సీఐ మహేందర్, ఎస్సై రాజు సంఘటనా స్థలానికి చేరుకొని సీసీ పుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గౌరి పెంద్రా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు. రింకుమల్లిని భర్త, సోదరులు కలిసి కిడ్నాప్ చేసినట్లు తెలిసింది.

# ప్రమాదమని తెలిసినా..!




**కాజీపేట:** పట్టణంలో మినీ వ్యాన్‌పై అధిక లోడ్‌తో ప్లాస్టిక్ సామాన్లు, సీసాల మూటలను వేసుకుని ప్రమాదకరంగా వెళ్తున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ప్రమాదమని, అధిక లోడ్ వేసుకుని వెళ్లకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ డీసీఎం, టాటా ఏస్ వాహనాల్లో భారీ మూటలతో రాకపోకలు సాగిస్తున్నాయి. వాహనదారులు నిర్భయంగా ట్రాఫిక్ సమయంలో వచ్చిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం.

## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**హన్మకొండ:** హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 1న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. రెడ్డి కాలనీ, కొత్తూరు, పాల జెండా, బుద్ధ భవన్, యాదవనగర్, హనుమాన్‌నగర్, ఈద్గా, పోచమ్మకుంట, నయీంనగర్, సమ్మయ్యనగర్, కుడా కాలనీ, శంకర్ నగర్, ఆదర్శ నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, గుండ్ల సింగారం, యాదవనగర్ పెట్రోల్ పంపు, లోటస్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. రంగశాయిపేట కూడలి, మహంకాళి దేవాలయం, ప్రభుత్వ ఆస్పత్రి, కుమ్మరివాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### స్టాటిస్టిక్స్ బోధనకు ఇంటర్వ్యూలు

**కాజీపేట:** కాజీపేట మండలం సోమిడి మహాత్మా జ్యోతిరావు పూలే మహిళా డిగ్రీ కళాశాలలో స్టాటిస్టిక్స్ సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు శనివారం ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94916 85294 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

### అవార్డుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

**హన్మకొండ:** బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ 6వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందిస్తూ సమాజ సేవ చేస్తున్న వారికి అవార్డులు అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పులి దేవేందర్ తెలిపారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 3న అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99511 93673 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### మైనార్టీ బాలుర గురుకులం తనిఖీ



**న్యూశాయంపేట:** హనుమకొండ హంటర్‌రోడ్డులోని మైనార్టీ బాలుర కళాశాల గురుకులాన్ని జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి కేఏ.గౌస్ హైదర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనం, ఆహార పదార్థాలను పరిశీలించారు. హాస్టల్ పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యార్థుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేసి నోట్‌బుక్స్, పెన్నులు, బ్యాగులను అందజేశారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శిరీష తదితరులు ఉన్నారు.

### పవన్‌కుమార్‌కు డాక్టరేట్




**హసన్‌పర్తి:** కిట్స్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న పవన్‌కుమార్.. పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈ మేరకు పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టర్ కార్తీక్, అసోసియేట్ ప్రొఫెసర్ మధుకర్‌రావు పర్యవేక్షణలో డిజైన్ ఆఫ్ రెడ్యూస్డ్ స్విచ్ కౌంట్ అండ్ ఫాల్ట్ రెసిలియంట్ ఎబిలిటీ ఆఫ్ 7 లెవల్ ఇన్వర్టర్ అనే అంశంపై పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథాన్ని పవన్‌కుమార్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనను కిట్స్ కళాశాల చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కోమల్‌రెడ్డి, ఈఈఈ విభాగాధిపతి ప్రొఫెసర్ నర్సింహారావు, ఏఓ డాక్టర్ రమేష్‌రెడ్డి, పీఆర్వో ప్రభాకరాచారి అభినందించారు.

### సీఐటీయూ నుంచి బహిష్కరణ

**న్యూశాయంపేట:** సీఐటీయూ అనుబంధ ఆటో ట్రాలీ యూనియన్ నుంచి మహ్మద్ మహబూబ్‌ను బహిష్కరిస్తున్నట్లు సీఐటీయూ వరంగల్ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం నిబంధనావళికి వ్యతిరేకంగా పనిచేస్తున్న మహబూబ్‌కు ఆటో ట్రాలీ యూనియన్‌తో ఇక నుంచి ఎలాంటి సంబంధం ఉండదని అరూరి కుమార్ పేర్కొన్నారు.

### టాక్స్ నిపుణులకు సన్మానం



**న్యూశాయంపేట:** ఎంఎస్‌ఎంఈల డిజిటల్ పరివర్తనకు సారథ్యం వహించిన టాక్స్ నిపుణులను టాలీ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వరంగల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో జోనల్ జనరల్ మేనేజర్ అనిల్ భార్గవన్, సీనియర్ సీఏ డీఎం.రావు, ఆంజనేయులు, మురళీమోహన్, గోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత విషయంలో రాజీలేదు



సఖి సెంటర్ ప్రారంభంలో ఎమ్మెల్యేలు, తదితరులు

**నయీంనగర్:** మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీపడదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. బాధిత మహిళలు, బాలికల కోసం సఖి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 6వ డివిజన్ లష్కర్‌బజార్‌లో నూతనంగా నిర్మించిన సఖి కేంద్రం (సఖి వన్ స్టాప్ సెంటర్) గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుతో కలిసి ఎమ్మెల్యే నాయిని గురువారం ప్రారంభించి మాట్లాడారు. బాధిత మహిళలకు సఖి సెంటర్‌లో ఉచిత కౌన్సెలింగ్, పోలీస్, న్యాయ, వైద్య సహాయం, తాత్కాలిక వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. 24 గంటల పాటు సఖి కేంద్రం సేవలందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ పనులు త్వరగా పూర్తి చేయాలి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

**న్యూశాయంపేట:** వరంగల్ కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. వరంగల్ ఆజంజాహి మిల్లు మైదానంలో నిర్మిస్తున్న కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల విభజన జరిగి ఏళ్లు గడుస్తున్నా జిల్లాలో కార్యాలయాలు లేకపోవడంతో అనేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మాలోత్ సాగర్, జగదీశ్వర్, ఎం.రామస్వామి, ఇస్మాయిల్, మల్లికార్జున్, ఐతమ్, నాగేష్, ఓదెలు, రత్నం, మహబూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ సభ్యులకు ఇన్సూరెన్స్ సౌకర్యం



సమావేశంలో ప్రెస్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు

**నయీంనగర్:** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులు, వారి కుటుంబాలకు ఎన్నికల హామీ మేరకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించనున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య తెలిపారు. ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్థిక పరమైన విషయాలు, ఇన్సూరెన్స్ కంపెనీలతో చర్చలు, కమిటీలో ఏకాభిప్రాయం, హామీల అమలులో కాస్త ఆలస్యమైందని పేర్కొన్నారు. సభ్యులు సహజ మరణం పొందినా బీమా వర్తించేలా మరో పాలసీని కూడా తీసుకురానున్నట్లు చెప్పారు. సభ్యత్వం లేని వారి విమర్శలు పట్టించుకోమని, ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పాలసీ వివరాలను సభ్యులకు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ ప్రతినిధి లక్ష్మణ్‌రావు వివరించారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల బాధ్యులు గాడిపెల్లి మధు, వల్లాల వెంకటరమణ, గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, కంకణాల సంతోష్, పెండెం వేణుమాధవ్, నరేందర్, దుర్గాప్రసాద్, గడ్డం కేశవమూర్తి, మెండు రవీందర్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 10న పాపన్న జయంతి ఉత్సవాలు



పాపన్న జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

**కేయూ క్యాంపస్:** ఈనెల 10న హైదరాబాద్ రవీంద్రభారతిలో జై గౌడ ఉద్యమ జాతీయ కమిటీ ఆధ్వర్యంలో వట్టికూటి రామారావు అధ్యక్షతన సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి ఉత్సవాలు జరగనున్నాయని వరంగల్ జిల్లా అధ్యక్షుడు మార్క రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ సోల్తి కిరణ్ తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కేయూ రెండో గేట్ వద్ద జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా గౌడ సంఘం నాయకులు బొనగాని యాదగిరి, శ్రీనివాస్, అనంతుల రమేష్, మోహన్, పులి మోహన్, వెంకన్న, వినోద్, రాజేష్, అంజయ్య, వెంకటేశ్, సాయిబాబు, నరేష్ పాల్గొన్నారు.

# తప్పిపోయిన మహిళ అప్పగింత



మహిళను బంధువులకు అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్

**ఖిలా వరంగల్:** షిరిడి సాయినగర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైల్‌లో ఏలూరు నుంచి ఖమ్మం వెళ్లేందుకు బయలుదేరిన ఓ వృద్ధురాలు ఖమ్మం రైల్వే స్టేషన్‌లో దిగకుండా వరంగల్ వైపు వస్తోందని ఆర్పీఎఫ్ పోలీసులకు జీఆర్పీ పోలీసులు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్.. గురువారం మధ్యాహ్నం వరంగల్ రైల్వేస్టేషన్‌కు రైలు చేరుకోగానే గుజ్జారు విజయలక్ష్మిని రైలులో నుంచి దించి ఆర్పీఎఫ్ స్టేషన్‌కు తరలించారు. ఆమె ఫోన్‌లో ఉన్న నంబర్ల ఆధారంగా బంధువులకు సమాచారమిచ్చారు. సమీప బంధువు కరీమాబాద్‌కు చెందిన క్షీరసాగర పద్మకు విజయలక్ష్మిని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ అప్పగించారు. కార్యక్రమంలో జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఏవీ నారాయణ, సిబ్బంది విక్రమ్, ప్రశాంతి పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

**ఎల్కతుర్తి :** భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని మోడల్ స్కూల్‌లో 2025–26వ విద్యా సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రెహమాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6నుంచి 10వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ చేసేందుకు ఆగస్టు 2న స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు చెప్పారు. 9 నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం



యాదగిరిని సన్మానిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీలో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను సెనెట్ హాల్‌లో వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం గురువారం సాయంత్రం సన్మానించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ సరళాదేవి, టెక్నీషియన్ –2 నర్సింహారావు, కేయూ ఎన్‌జీఓ మాజీ అధ్యక్షుడు, డ్రైవర్ లకావత్ యాదగిరి, బుక్ కీపర్ కమలకు జ్ఞాపికలు ఇచ్చి అభినందించారు.